అయ్యప్ప ఆలయం అంతా ప్రత్యేకం

- పాలకొల్లులో ఆకర్షిస్తున్న అయ్యప్ప ఆలయం
- 11 సంవత్సరాలుగా ఉచిత అన్నదానం
- 33 ఏళ్లుగా కేరళ సంప్రదాయంలోనే పూజలు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు నరసాపురం రోడ్డులోని ఉన్న శ్రీ అయ్యప్పస్వామి ఆలయం అందరినీ ఆకర్షిస్తుంది. ఈ ఆలయ నిర్మాణం జరిగి దాదాపుగా 33 సంవత్సరాలు పూర్తికావస్తుంది. ఆలయానికి మండలం, మకర జ్యోతి దర్శనానికి వెళ్లే భక్తులు ఎక్కువగా ఉండడంతో అక్టోబర్, నవంబర్, డిసెంబర్, జనవరి నెలలోనే భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వస్తుంటారు. ఆలయానికి ఈ మూడు నెలల్లో వచ్చే ఆదాయంతోనే సంవత్సరమంతా దూప, దీప, నైవేధ్యాలతో పాటు అర్చకులు, ఆలయం మెయింటెనెన్స్ చేసుకుంటున్నారు. గత 11 సంవత్సరాలుగా దాతల సహకారంతో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దాదాపుగా 80 రోజుల పాటు రోజుకో దాత సహకారంతో ఆలయంలో ఉచిత అన్నదానం ఏర్పాటుచేస్తున్నారు. ఈ అన్నదానంలో అయ్యప్ప, శివ, భవానీ మాలధారులు రోజుకు సుమరుగా 600 నుంచి 700 వరకూ స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు.ఆలయంలో విఘ్నేశ్వరుడు, నాగరాజు, వేంకటేశ్వరస్వామి, మాలికాపురత్తమ్మ, నవగ్రహాలు ఇలా ఉపాలయాలతో పాటు ధ్యానమందిరం కూడా ఉంది. ఈ ధ్యాన మందిరంలో ప్రతి పౌర్ణమి, అమావాస్యలకు సుమారు 100 మంది భక్తులు వచ్చి ధ్యానం చేస్తుంటారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు....

ఆలయంలో ప్రతిరోజూ గణపతి హోమం, అయ్యప్ప స్వామికి మహాభిషేకం, అర్చనలు, అలంకార దర్శనం వంటి పూజలు నిర్వహిస్తూ ఉంటారు. నవంబర్ 16 నుంచి డిసెంబర్ 26 వరకూ మండల కాలం కలశ పూజలు చేస్తారు. అలాగే ప్రతీ సంవత్సరం నవంబర్ 16 పడిపూజ అతివైభవంగా నిర్వహిస్తారు. ఏప్రిల్ 14 10 నుంచి 18 వరకూ కేరళ సంవత్సరాది ప్రకారం ఇష్యు పండుగ ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. అలాగే జనవరి 14న మకర సంక్రాంతి రోజున శబరిమలైలో జ్యోతి దర్శన సమయానికి ఇక్కడ జ్యోతి దర్శనం, పదునెట్టాంబడి ఏర్పాటు చేస్తారు. దాదాపుగా పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో ఈ ఆలయమే అతిపెద్ద ఆలయం. గోదావరి జిల్లాల్లో ఏకశిలతో తయారు చేసిన పదునెట్టాంబడి ఈ ఆలయానికి ప్రత్యేకత. ఇలా ఏకశిలతో తయారుచేసిన పదునెట్టాంబడి తూర్పు గోదావరి జిల్లా ద్వారపూడి తరువాత పాలకొల్లులోనే ఉందని భక్తులు చెబుతున్నారు.


నిర్మాణమే ప్రత్యేకం

ఆలయానికి కింద భాగంలో పూర్ణకుంభం ముఖద్వారంతో ఓ మండపం ఉంది. ఆ మండపంలో ప్రతి సంవత్సరం స్వామివారి పీఠం ఏర్పాటుచేస్తుంటారు. ఈ పీఠంలో ఎక్కువగా ఒకరు లేక ఇద్దరు ముగ్గురు కలిసి మాల ధరించి పీఠం ఏర్పాటు చేసుకోవడానికి వీలు లేని స్వాములకు ఇక్కడ ఏర్పాటు చేసే పీఠం ఎంతో వెసులుబాటుగా ఉంటుంది. స్వాములు ఇక్కడే పడుకోవడానికి అలాగే ఆలయం పక్కనే ఉన్న కాలువలో స్నానమాచరించడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇక్కడ పూజలో పాల్గొనడానికి మండల కాలానికి పూజాసామాగ్రి నిమిత్తం స్వాముల రూ.3 వేల వరకూ చెల్లిస్తుంటారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న స్వాములు ఇవ్వలేకపోయినా ఎలాంటి ఒత్తిడి ఉండదని అందరితో సమానంగా పూజలో పాల్గొనవచ్చని కొందరు స్వాములు చెబుతున్నారు.


పూర్ణ కుంభ ద్వారంతో ఆలయ ప్రాకారం


అయ్యప్ప ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)


మూలవిరాట్‌కు పూజ చేస్తున్న అర్చక స్వామి


ఏకశిలతో తయారుచేసిన పదునెట్టాంబడి

47 ఏళ్ల నుంచి దీక్ష



ఇప్పటికి 47 సంవత్సరాలు నుండి దీక్ష చేస్తున్నాను. వరుసగా 18 సంవత్సరాలు 108 రోజులు దీక్ష చేపట్టి 18వ సారి దీక్షలో శబరిమలై కాలినడకన వెళ్లాను. అన్నదానం నిమిత్తం రోజుకు ఒక దాత సుమారు 80 మంది దాతలతో 80 రోజులు స్వాములకు ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నాం. భక్తులు సమర్పించిన బంగారం, వెండితో కలిపి పంచలోహ విగ్రహాన్ని తయారు చేయించాం. – బాబుల్ గురుస్వామి, ఆలయ వ్యవస్థాపకులు, పాలకొల్లు

కేరళ సంప్రదాయంలోనే పూజలు



మా స్వగ్రామం కై కలూరు. స్వామివారి పూజా సాంప్రదాయాలన్నీ కేరళలో నేర్చుకున్నాను. ఈ ఆలయంలో సుమారు 21 సంవత్సరాలనుంచి పనిచేస్తున్నాను. పూజలన్నీ కేరళ సాంప్రదాయ పద్ధతిలోనే జరుగుతాయి. ప్రబుధవారం స్వామివారికి అలంకార పూజలు జరుగుతాయి. భక్తులు అధికసంఖ్యలో పాల్గొంటారు. – బాలసుబ్రమణ్యం చైనీలు, ఆలయ ప్రధానార్చకుడు, పాలకొల్లు

16 ఏళ్లుగా ఇక్కడే పీఠం



నేను గత 27 సంవత్సరాలుగా అయ్యప్ప దీక్ష చేపడుతున్నాను. 16 సంవత్సరాలనుంచి ఆలయంలోఉన్న మండపంలోనే పీఠం ఏర్పాటుచేసుకుంటున్నాం. ప్రస్తుతానికి ఇక్కడ 80 మంది స్వాములు ఉన్నారు. జ్యోతి దర్శనానికి వెళ్లే స్వాముల సంఖ్య ఇంకా పెరుగుతుంటుంది. ప్రత్యేక పీఠం ఏర్పాటు చేసుకోలేని స్వాములకు ఈ పీఠం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆలయంలోనే ఉచిత అన్నదానం కూడా ఏర్పాటు చేస్తున్నారు. – తిప్పని శ్రీనివాస స్వామి, పాలకొల్లు

క్లుప్తంగా

పంచారామ క్షేత్రాల యాత్ర ప్రారంభం


పంచారామ క్షేత్రం బస్సును ప్రారంభిస్తున్న డీఎం

నరసాపురం: కార్తీకమాసంలో ప్రతి సోమవారం పంచారామ క్షేత్రాలను దర్శించుకునే విధంగా నరసాపురం డిపో నుంచి బస్సుల సదుపాయం కల్పించినట్టు డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. ఆదివారం బస్టాండ్ నుంచి బయలుదేరిన పంచారామ స్పెషల్ బస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఆదివారం రాత్రి 7.30 గంటలకు రెండు బస్సులు బయలుదేరతాయన్నారు. సోమవారం అమరావతి, సామర్లకోట, ద్రాక్షారామం, భీమవరం, పాలకొల్లు క్షేత్రాలకు తీసుకెళ్లి తీసుకొస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వక్ఫ్ పరిరక్షణ సభకు తరలిన నాయకులు


విజయవాడ సభకు వెళుతున్న ముస్లిం నాయకులు

నరసాపురం: విజయవాడలో నిర్వహించిన వక్ఫ్ పరిరక్షణ సభకు నరసాపురం నుంచి ఆదివారం ముస్లింలు భారీగా తరలివెళ్లారు. నరసాపురం అంజుమన్ సంఘం ఆధ్వర్యంలో 200 మంది వెళ్లారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ బులిమస్తాన్, ఎండీ దావూద్‌ఖాన్, ఎండీ మౌలాలీఖాన్ నాయకత్వంలో బయలుదేరి వెళ్లారు. వక్ఫ్ బోర్డు ఆస్తులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెస్తున్న యాక్ట్‌ను రద్దు చేయాలన్నారు. ముస్లింల హక్కుల పరిరక్షణ విషయంలో కేంద్రప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు.

ఘనంగా దేవాంగ సంక్షేమ సంఘం కార్తీక వన సమారాధన


సంఘ పెద్దలను సత్కరిస్తున్న దృశ్యం

నరసాపురం: పట్టణంలో ఆదివారం శ్రీచౌడేశ్వరిదేవి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. ఉదయం ఉసిరి చెట్టు వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం ఆటపాటలతో ఆహ్లాదంగా గడిపారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర నాయకులు బీరక ప్రసాద్, ఉట్టి నాగసైనం మాట్లాడుతూ కార్తీక వనసమారాధనలు మన సంస్కృతిలో భాగమన్నారు. దేవాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. దేవాంగులు సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా ముందుకెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బల్ల రమేష్, కనకం ప్రసాద్, గోరు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో స్నానాల గది ఏర్పాటు


ఉల్లంపర్రులో రోటరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్నానాల గది

పాలకొల్లు అర్బన్: మండలంలోని ఉల్లంపర్రు శ్రీ కనకదుర్గమ్మ ఆలయం వద్ద కార్తీకమాసం పురస్కరించుకుని మహిళలు తెల్లవారుజామున కాలువలో స్నానాలు చేసి దీపాలు వెలిగిస్తారు. మహిళలు స్నానాలు చేసి దుస్తులు మార్చుకునే నిమిత్తం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్నానాల గదిని నిర్మించారు. రోటరీ సభ్యులు మద్దాల వాసు, మద్దాల రాంప్రసాద్ విరాళంతో ఏర్పాటు చేసిన స్నానాల గదిని ఆదివారం రోటరీక్లబ్ అధ్యక్షుడు రావాడ సతీష్ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి జవ్వాజి కల్యాణ్, కోశాధికారి పోతాబత్తుల సత్యనారాయణ, అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్, భీమనాదం సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతులు బీమా ప్రీమియాన్ని చెల్లించాలి

యలమంచిలి: రబీ పంట కోసం రైతులంతా ప్రధానమంత్రి పంట బీమా యోజన ప్రీమియాన్ని డిసెంబర్ 31లోపు చెల్లించాలని మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. బ్యాంకు రుణాలు తీసుకున్న రైతులు ఆ బ్యాంకు ద్వారా ప్రీమియం చెల్లించవచ్చని వివరించారు. బ్యాంకు రుణాలు లేని రైతులు కామన్ సర్వీస్ సెంటర్స్, బ్యాంకులు, ఏబీసీ పోర్టర్స్ ద్వారా చెల్లించాలని పేర్కొన్నారు. ఎకరానికి రూ.615 చెల్లించాలని ఆమె కోరారు. ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినపుడు పంట నష్ట పరిహారం పొందాలంటే ప్రతి రైతు ఈ బీమా చేయించుకోవాలని ఆమె కోరారు.

అయ్యప్ప శరణుఘోషతో మారుమోగిన మార్టేరు


మార్టేరులో స్వామివారి ఆభరణాలను ఊరేగిస్తున్న అయ్యప్ప మాలధారులు

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు గ్రామంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ పీఠం, సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్ప స్వామి వారి గణపతి హోమం, కలస పూజ, పడిపూజ,అనంతరం భజన కార్యక్రమాలు ఆదివారం మార్టేరులో ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కాయలగౌతమ చంద్రశేఖర్ రెడ్డి 18వ పడి శబరిమల యాత్ర చేస్తున్న సందర్భంలో చంద్రశేఖర్ రెడ్డి, నీరజా దంపతులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గురుస్వాములు అడబాల శ్రీనివాస్, మల్లిడి రామకృష్ణారెడ్డి, తమనంపూడి విజయ్ ఆధ్వర్యంలో వేద పండితులు శ్రీనివాసుల గోపాలచార్యులు 216 మంది కన్నె స్వాములతో గణపతి హోమం, కలస పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భిక్షానంతరం స్వామి వారి ఆభరణాలతో గ్రామోత్సవం నిర్వహించి కాయల వెంకటరెడ్డి నివాసం నుంచి అయ్యప్ప స్వామి వారి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకు వెళ్లి ఆభరణాలను స్వామివారికి అలంకరించి, అనంతరం 216 మంది కన్యాసాములతో కలశపూజ పడిపూజ కార్యక్రమాలను నిర్వహించారు. తర్వాత భీమవరానికి చెందిన ఉండవల్లి బాల బ్రదర్స్ భజన కార్యక్రమం నిర్వహించి అనంతరం, పడి హారతి, ఉంజల సేవ, హరివరాసనం ఘనంగా నిర్వహించారు.

హైందవ శంఖారావ సభను విజయవంతం చేయాలి


సుంకరపాలెంలో సమావేశమైన సంఘ్ పరివార్, ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ నాయకులు

యలమంచిలి: వచ్చే ఏడాది జనవరి 5న కృష్ణా జిల్లా గన్నవరంలో జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభ సన్నాహకాలలో భాగంగా ఆదివారం సభ వివరాల కరపత్రాన్ని విడుదల చేశారు. గుంపర్రు పంచాయతీ సుంకరపాలెంలో సంఘ్ పరివార్, ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ నాయకులు సమావేశమై ఈ సభ విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ పశ్చిమ గోదావరి జిల్లా కన్వీనర్ ముత్యాల చంటి, యలమంచిలి మండల కార్యదర్శి దివి ప్రకాష్, అర్చక పురోహిత విభాగ్ అజయ్ నారాయణం, సుంకరపాలెం బజరంగ్‌దళ్ కన్వీనర్ కొడవటి సాయి, సాప్తాహిక్ ప్రముఖ బోలిశెట్టి బాబి తదితరులు పాల్గొన్నారు.

బీసీలు ఆర్థికంగా బలపడాలి


ఆచంటలో శెట్టిబలిజ వర్తక సంఘ వనసమారాధనలో ఆచంట ఎమ్మెల్యే పితాని

పెనుగొండ: బీసీ కులస్తులు ఆర్థికంగానూ, రాజకీయంగానూ మరింత బలోపేతం కావాలని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆచంట ఏఎంసీ ఆవరణలో నిర్వహించిన శెట్టి బలిజ వర్తక సంఘ కార్తీక వనసమారాధనలో పాల్గొన్నారు. బీసీలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తానని ఎమ్మెల్యే పితాని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పితానిని సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శెట్టి బలిజ సంఘ నాయకులు దొంగ నాగార్జున, కేతా మీరయ్య, గుడాల శ్రీనివాస రావు, కేతా రామకృష్ణ పితాని వెంకట్, వర్తక సంఘ ప్రతినిధులు కడలి రామకృష్ణ, పెచ్చెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన


సీసీ రోడ్ల నిర్మాణ పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు అర్బన్: పోడూరు మండలం వద్దిపర్రులో రూ.45లక్షలతో నిర్మించనున్న వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం శంకుస్థాపన చేశారు. అలాగే ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.8లక్షలతో కొనుగోలు చేసిన ఉచిత రవాణా వాహనాన్ని మంత్రి నిమ్మల రామానాయుడు ప్రారంభించారు. టిడ్కో గృహాల లబ్ధిదారులకు పెంకుళ్లపాడు నుంచి పాలకొల్లు బస్టాండ్ వరకు ఉచితంగా ప్రయాణించడానికి ఈ వాహనాన్ని వినియోగిస్తారని మంత్రి నిమ్మల చెప్పారు. వద్దిపర్రు గ్రామం నక్కల డ్రెయిన్ కారణంగా తరచూ ముంపునకు గురికాకుండా శాశ్వత చర్యలు తీసుకున్నట్లు మంత్రి నిమ్మల చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సబ్బితి సుమంగళి, పీఆర్ డీఈ కేడీఆర్ స్వామి, ఎంపీడీఓ డీఎస్ఎల్ మంగకుమారి, ఈఓపీఆర్‌డీ కేఎం వైభవతి, సర్పంచ్ వడ్లపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు ఆదివారం విలేకరులకు చెప్పారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని కోరారు.

నేడు విశిష్ట వ్యక్తులకు సత్కారం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని లయన్స్ కమ్యూనిటీ హాలులో విద్యాచైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం ఐదు గంటలకు విశిష్ట వ్యక్తులకు సత్కారం చేయనున్నట్లు సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు మెరిపే శ్రీనుబాబు, పోలిశెట్టి శ్రీశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసాపురం ఆర్డీఓ దాసి రాజు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జి) ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రముఖ వైద్యుడు డా.చల్లా మల్లికార్జునశర్మ, ఉపాధ్యాయులు బుంగ జెస్సికళ, దొంగ చింతయ్య, కంకిపాటి నాగరాజు (ఎస్‌బీఐ) లను సత్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు మేడపాడులో లక్ష బిల్వార్చన

యలమంచిలి: కార్తీకమాసం మొదటి సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని మేడపాడు శ్రీఉమారామలింగేశ్వరస్వామి (శివాలయం) ఆలయంలో లక్ష బిల్వార్చన (లక్ష పత్రి పూజ) నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు బాదంపూడి సత్యనారాయణమూర్తి ఆదివారం విలేకరులకు తెలిపారు. బాదంపూడి చిరంజీవి శర్మను బ్రహ్మత్వంలో జరిగే ఈ పూజలో ఆలయ ప్రదిక్షణ, గణపతి పూజ, హోమాలు, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

మాలలపై దాడులను అరికట్టాలి

తణుకు టౌన్: మాలలపై జరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు మాలలంతా ఐక్యంగా పోరాడాలని నియోజకవర్గ దళిత ఐక్య వేదిక అధ్యక్షుడు పొట్ల సురేష్ కోరారు. ఆదివారం రాత్రి తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో కాకి రాముడు అధ్యక్షతన మండల మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొట్ల సురేష్ మాట్లాడుతూ మండపేట, తణుకు పట్టణాలలో జరిగిన హత్యలపై పూర్తి స్థాయి విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం


ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలకొల్లు పట్టణ యూటీఎఫ్ శాఖ నూతన కార్యవర్గ సభ్యులు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు పట్టణ యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఎంఎంకేఎన్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఎస్.రాంజీకుమార్ అధ్యక్షతన నిర్వహించిన యూటీఎఫ్ మహాసభలో గౌరవాధ్యక్షుడిగా జె జయదుర్గారావు, అధ్యక్షుడి ఎస్.రాంజీకుమార్, సహాధ్యక్షులుగా కె.గోపికృష్ణ, ఇ.శ్రీలక్ష్మి, ప్రధానకార్యదర్శిగా కె.త్రినాథ్, కోశాధికారిగా ఎస్‌వీఎస్ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు తదితరులను ఏకగ్రీవంగాఎన్నుకున్నారు. ఈసందర్భంగా యూటీఎఫ్‌కి సేవలందించి పదవీవిరమణ చేసిన ఉపాధ్యాయులను సతక్కరించారు.

నేడు మంచినీటి సరఫరా నిలిపివేత

నరసాపురం: మున్సిపాలిటీలోని హెడ్ వాటర్‌వర్క్స్ కార్యాలయంలో మరమ్మతులు కారణంగా సోమవారం సాయంత్రం పట్టణం మొత్తం కుళాయిల ద్వారా మంచినీటి సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తిరిగి మంగళవారం ఉదయం యథావిధిగా సరఫరా జరుగుతుందని వివరించారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

సామాజిక సేవల్లో లయన్స్ ముందంజ


లయన్స్ క్లబ్ సభ్యులను సత్కరిస్తున్న ఇంటర్నేషనల్ గవర్నర్ బి.విజయ్‌కుమార్‌రాజు

పాలకొల్లు అర్బన్: సామాజిక సేవల్లో లయన్స్ ముందంజలో ఉంటుందని లయన్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ బి.విజయ్‌కుమార్‌రాజు చెప్పారు. ఆదివారం లయన్స్‌కమ్యూనిటీ హాలులో లయన్స్ క్లబ్ స్థాపించి 55 ఏళ్లు, అలాగే లయన్స్ కంటి ఆసుపత్రి ప్రారంభించి 35 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా లయన్స్ సభ్యులను సత్కరించారు. ఈ సందర్భంగా లయన్స్ కంటి ఆసుపత్రిలో రూ.2.50 కోట్లతో ఆధునిక పరికరాలను విజయ్‌కుమార్‌రాజు ప్రారంభించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొని లయన్స్‌సభ్యుల సేవలను అభినందించారు. అలాగే గత 55ఏళ్లుగా లయన్స్ క్లబ్‌కి వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులను సత్కరించారు. ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్లు డా.సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జి), చిగురుపాటి వరప్రసాద్, డా.చంద్రశేఖర

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. కార్తీక మాసం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. బీచ్‌కు వెళ్లే వారు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ ఎం.అరుణ్ కుమార్, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా లలితా పారాయణం


కోటి లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం చేస్తున్న సుహాసినీలు

పాలకొల్లు అర్బన్: మండలంలోని వాయుత్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శివదేవునిచిక్కాలలోని శ్రీ పార్వతీ సమేత శ్రీ శివదేవస్వామి ఆలయంలో లోక కల్యాణార్థం, విశ్వశాంతి కోసం కోటి లలిత సహస్ర స్తోత్ర నామపారాయణం నిర్వహిస్తున్నట్లు అర్చక స్వామి ర్యాలి సతీష్ ఆదివారం విలేకరులకు తెలిపారు. శ్రీ శివదేవస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని కార్తీక మాసం ప్రారంభమైన ఈ నెల 1 నుంచి డిసెంబర్ 11వ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఉత్సాహంగా కోలాట భజన కళాకారుల గజ్జె పూజ


హరే శ్రీనివాస కోలాట భజన కళాకారులు

పాలకొల్లు అర్బన్: మండలంలోని భగ్గేశ్వరం గ్రామానికి చెందిన 50 మంది కొత్తగా కోలాట భజన నేర్చుకుని ఆదివారం గజ్జె పూజ నిర్వహించి తొలి కోలాట భజన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో నిర్వహించారు. వైదిక కార్యక్రమాల్లో కోలాట భజన చేయనున్నట్లు హరే శ్రీనివాస టీం నిర్వాహకురాలు చింతపల్లి లక్ష్మి తెలిపారు.